ONE PERSON CAN MAKE DIFFERENCE
B.K. YADAV FOUNDATION

# వార్త మిర్రర్
తెలుగు దినపత్రిక

శనివారం,
మార్చి 29, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-

# భారీ భూకంపం



- థాయ్‌లాండ్, మయన్మార్‌లో నేలమట్టమైన భవనాలు
- 7.7 తీవ్రతతో కంపించిన భూమి
- రెండు దేశాల్లో భారీగా ఆస్తి నష్టం
- ప్రాణనష్టం అపారమే!
- 1,000 పడకల ఆస్పత్రి నేలమట్టం
- 200 దాటిన మృతులు
- మయన్మార్‌లోనే 180 మంది మృత్యువాత
- భారత్‌లోనూ ప్రకంపనలు

**భారీ భూకంపం థాయ్‌లాండ్, మయన్మార్‌లను అతలాకుతలం చేసింది. 7.7 తీవ్రతతో మయన్మార్‌లో సంభవించిన ప్రకంపనల ధాటికి ఇరు దేశాల్లో అపార ఆస్తి నష్టం సంభవించింది. భారీ భవనాలు కుప్పకూలాయి. నిర్మాణాలన్నీ పగుళ్లిచ్చాయి. మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.**

**విధ్వంస తీవ్రత దృష్ట్యా ప్రాణ నష్టమూ భారీగానే ఉంటుందని అనుమానిస్తున్నారు. ఇప్పటిదాకా మయన్మార్‌లో 180 మందికి పైగా మరణించగా 750 మందికి పైగా గాయపడ్డారు. బ్యాంకాక్‌లో 10 మందికి పైగా మృత్యువాత పడ్డారు. అంతర్యుద్ధంతో అతలాకుతలమవుతున్న మయన్మార్‌లో సహాయక, పునరావాస చర్యలు సవాలుగా మారాయి.**

ప్రకృతి ప్రకోపానికి థాయ్‌లాండ్, మయన్మార్ చిగురుటాకుల్లా వణికిపోయాయి. శుక్రవారం మధ్యాహ్నం మయన్మార్‌లో 7.7 తీవ్రతతో సంభవించిన భూకంపం ఇరు దేశాల్లోనూ భారీ విధ్వంసం మిగిల్చింది. కాసేపటికే 6.4 తీవ్రతతో మరోసారి భూమి కంపించగా తర్వాత కూడా మరో నాలుగైదు ప్రకంపనాలు వణికించాయి. భారీ భవనాలు కళ్లముందే పేకమేడల్లా కుప్పకూలాయి. పురాతన బ్రిడ్జిలు నేలమట్టమయ్యాయి. మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయి. చాలాచోట్ల విద్యుత్ సరఫరా లైన్లు తదితరాలు దెబ్బతిన్నాయి. ఇరుదేశాల్లో ఇప్పటిదాకా 200 మందికి పైగా మరణించారు. మయన్మార్‌లోనే 180 మందికి పైగా మరణించారు. 750 మందికి పైగా గాయపడ్డారని సైనిక ప్రభుత్వం ప్రకటించింది. అంతర్జాతీయ సమాజం తక్షణం ఆదుకోవాలని కోరింది. భవనాల శిథిలాల కింద చాలామంది చిక్కుకోవడంతో మృతుల సంఖ్య భారీగా పెరిగేలా ఉంది. మయన్మార్ రాజధాని నేపిడాలో వెయ్యి పడకల ఆస్పత్రి కుప్పకూలింది. అందులో అత్యధికులు మరణించి ఉంటారంటున్నారు. భూకంప కేంద్రాన్ని సెంట్రల్ మయన్మార్‌లో రెండో అతి పెద్ద నగరమైన మాండలేకు సమీపంలో మొన్యవా సిటీకి 50 కిలోమీటర్ల దూరంలో గుర్తించారు. కేవలం 10 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించడంతో ప్రమాద తీవ్రత చాలా పెరిగింది. థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్‌లో భారీ భవనాలు తీవ్రంగా దెబ్బ తిన్నాయి. చటూచాక్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న 33 అంతస్తుల భారీ భవంతి నేలమట్టమైంది. దానికింద కనీసం 90 మందికి పైగా చిక్కుకున్నట్టు తెలుస్తోంది. భూకంప తీవ్రతకు భవనాలు అటూ ఇటూ ఊగిపోతున్న దృశ్యాలు, అత్యంత ఎత్తైన ఓ భవనం తాలూకు పై అంతస్తులోని స్విమింగ్‌పూల్ నుంచి నీళ్లన్నీ కిందకు పడుతున్న వీడియోలు వైరల్‌గా మారాయి. ఒకట్రెండు రోజుల్లో మరిన్ని భూకంపాలు తప్పకపోవచ్చన్న హెచ్చరికలు వణికిస్తున్నాయి. అంతర్యుద్ధంతో అతలాకుతలమవుతున్న మయన్మార్‌లో సహాయక, పునరావాస చర్యలు

(మిగతా 2వ పేజీలో)



## అక్కడ 400 ఎకరాల భూమిని అమ్మడాన్ని
## తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా: కేటీఆర్

- సీఎం రేవంత్ రెడ్డి ప్రకటనను తప్పుబట్టిన కేటీఆర్
- విశ్వవిద్యాలయ ప్రాంగణంలో వృక్ష, జంతు జాతుల ఉనికిని గుర్తు చేసిన కేటీఆర్
- కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకృతి వినాశనానికి పాల్పడుతోందని విమర్శ
- వెంటనే నిర్ణయం వెనక్కి తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్

కంచే-గచ్చిబౌలిలో 400 ఎకరాల ప్రభుత్వ భూమిని అమ్మేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, దీన్ని తాను వ్యతిరేకిస్తున్నానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా తన నిరసనను వ్యక్తం చేశారు. ఈ భూమిని అమ్మడం ద్వారా పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన ప్రకటనను కేటీఆర్ తప్పుబట్టారు. ఆ భూమిలో ఎటువంటి జంతువులు లేవని సీఎం చేసిన ప్రకటన వాస్తవం కాదని ఆయన అన్నారు. “హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్ సీయూ) ప్రాంగణంలో 700లకు పైగా పుష్ప వృక్ష జాతులు, అనేక రకాల ప్రాణులు, (మిగతా 2వ పేజీలో)

## జేఈఈ మెయిన్స్ తేదీల్లో మార్పులు?



ఏప్రిల్ 2 నుంచి జరగాల్సిన పరీక్ష..
అదే రోజు సీబీఎస్ఈ పరీక్ష
రెండూ ఎలా రాస్తామంటున్న విద్యార్థులు



## బేస్‌మెంట్ పూర్తయితే వెంటనే రూ.1,00,000

ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ వేగవంతం చేయాలి..
ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశంలో మంత్రులు,
ఎమ్మెల్యేలతో సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

## ఉగాది తర్వాత ఏఐ సిటీకి శంకుస్థాపన

పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడి
క్లియర్‌టెల్లిజెన్స్ ఇండియా
డెలివరీ అండ్ ఆపరేషన్స్ సెంటర్ ప్రారంభం




# పెద్దపల్లి జిల్లాలో పరువుహత్య

- రెండేళ్లుగా యువతితో ప్రేమలో సాయికుమార్.. కులాలు వేరు కావడంతో ఒప్పుకోని యువతి తండ్రి
- తన కుమార్తెతో మాట్లాడొద్దని హెచ్చరిక.. అయినా ఆమెతో కలిసి బర్త్‌డే జరుపుకోవడంతో ఆగ్రహం
- రాత్రికి స్నేహితులతో కలిసి పార్టీ చేసుకుంటుండగా వెంటాడి హతమార్చిన వైనం

పెద్దపల్లి: కుమార్తెను ప్రేమిస్తున్నాడనే కోపంతో ఓ యువకుడిని యువతి తండ్రి కిరాతకంగా హతమార్చిన దారుణ ఘటన గురువారం రాత్రి పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ముప్పిరితోటలో కలకలం సృష్టించింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పూరెల్ల సాయికుమార్ (20), అదే గ్రామానికి చెందిన ఓ యువతి రెండేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. కులాలు వేరుకావడంతో వారి ప్రేమకు యువతి తండ్రి ముత్యం సదయ్య అడ్డుచెప్పాడు. తొమ్మిదో తరగతిలోనే చదువు మానేసిన సాయికుమర్‌ను ఇకపై తన కూతురితో మాట్లాడొద్దని పలుమార్లు హెచ్చరించాడు. అయినా యువతీయువకులు తరచూ మాట్లాడుకోవడంతోపాటు గురువారం ఉదయం కలిసే సాయికుమార్ బర్త్‌డే వేడుకలు జరుపుకున్నారు. ఈ సమాచారం తెలియడంతో రగిలిపోయిన యువతి తండ్రి ముత్యం సదయ్య గురువారం రాత్రి 10 గంటలకు సాయికుమార్‌ను గొడ్డలితో నరికి చంపాడు. పెద్దపల్లిలోని హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ సెకండియర్ చదువుతున్న యువతిని సాయికుమార్ గురువారం కలిశాడు. ఆమెతో కలిసి బర్త్‌డే వేడుకలు చేసుకున్నాడు. రాత్రికి గ్రామంలో (మిగతా 2వ పేజీలో)





## జస్టిస్ యశ్వంత్‌కు ఏ పనీ ఇవ్వొద్దు
### ::: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: అవినీతి ఆరోపణలతో చిక్కుల్లో పడ్డ ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయడానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కాసేపటికి సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. జస్టిస్ యశ్వంత్ వర్మ కేవలం బదిలీపై మాత్రమే అలహాబాద్ హైకోర్టుకు వస్తున్నారని, ఆయనకు ప్రస్తుతానికి

(మిగతా 2వ పేజీలో)



## 3 నుంచి థాయ్‌లాండ్, శ్రీలంకల్లో మోదీ పర్యటన

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏప్రిల్ 3 నుంచి 6వ తేదీ వరకు థాయ్‌లాండ్, శ్రీలంక దేశాల్లో పర్యటించనున్నారు. ప్రాంతీయ సహకారానికి ఊతమిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన ‘మహాసాగర్ విధానం’అమలే ఈ పర్యటన లక్ష్యమని విదేశాంగ శాఖ శుక్రవారం తెలిపింది. మొదటగా ఆయన థాయ్‌లాండ్ రాజధాని బ్యాంకాక్ 3, 4 తేదీల్లో జరిగే బిమ్‌స్టెక్ ఆరో శిఖరాగ్రంలో పాల్గొంటారు. 3న థాయ్ ప్రధానితో భేటీ అవుతారు. అనంతరం శ్రీలంకకు వెళతారని తెలిపింది. శ్రీలంక అధ్యక్షుడు అనురా కుమార దిసనాయకేతో చర్చలు జరుపుతారంది. మారిషస్ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ ‘మహాసాగర్’ను ప్రకటించినట్లు విదేశాంగ శాఖ గుర్తు చేసింది. భారత్‌తోపాటు బంగాళాఖాత తీరప్రాంత దేశాలైన శ్రీలంక, బంగ్లాదేశ్, మయన్మార్, నేపాల్, భూటాన్‌లతో ఏర్పాటైనదే బిమ్‌స్టెక్ కూటమి.

# జస్టిస్ యశ్వంత్‌కు ఏ పనీ ఇవ్వొద్దు

ఏ విధమైన జ్యుడిషియల్ వర్క్ అప్పచెప్పవద్దని సీజేఐ సంజీవ్ ఖన్నా కోరారు. ఈ మేరకు అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం జస్టిస్ యశ్వంత్ పై విచారణ పెండింగ్ లో ఉన్న క్రమంలోనే ఆయనకు ఏ పనీ అప్పచెప్పవద్దని సీజేఐ సూచించారు. అంతకుముందు ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా ఈ తరహా ఆదేశాలనే జారీ చేశారు సీజేఐ.

**కేంద్రానికి సిఫార్సు.. గ్రీన్ సిగ్నల్**

జస్టిస్ యశ్వంత్ వర్మ బదిలీ అంశానికి సంబంధించి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేసే క్రమంలో కేంద్రానికి ప్రతిపాదన పంపింది సీజేఐ నేతృత్వంలోని సుప్రీంకోర్టు కొలీజియం. దీనికి ఈరోజు(శుక్రవారం) గ్రీన్ సిగ్నల్ లభించడంతో యశ్వంత్ వర్మ.. అలహాబాద్ హైకోర్టుకు వెళ్లనున్నారు. 2021లో అలహాబాద్ హైకోర్టు నుంచి బదిలీపై ఢిల్లీ హైకోర్టుకు వచ్చిన యశ్వంత్ మళ్లీ అక్కడికే వెళ్లనున్నారు.

**ఆరు రాష్ట్రాల బార్ అసోసియేన్స్ తో సీజేఐ భేటీ**

అయితే యశ్వంత్ వర్మ సచ్చీలురుగా బయటకొచ్చేవరకూ అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయొద్దంటూ అక్కడ బార్ అసోసియేషన్ తో పలు రాష్ట్రాల బార్ అసోయేషన్స్ కూడా కోరాయి. గుజరాత్ హైకోర్టు బార్ అసోసియేషన్, కేరళ హైకోర్టు బార్ అసోసియేషన్, కర్ణాటక హైకోర్టు బార్ అసోసియేషన్, లక్నో బార్ అసోసియేషన్స్ డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో దీనిపై సీజేఐ ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ క్రమంలోనే పలు బార్ అసోసియేషన్ హెడ్స్ తో సీజేఐ సంజీవ్ ఖన్నా నిన్న(గురువారం)ఢిల్లీలో సమావేశమయ్యారు. ప్రస్తుతానికి జస్టిస్ యశ్వంత్ బదిలీని నిలుపుదల చేయాలని సదరు బార్ అసోసియేషన్స్ కోరిన తరుణంలో వారితో సీజేఐ భేటీ అయ్యారు. ఆయా రాష్ట్రాల బార్ అసోసియేషన్ అధ్యక్షులతో సీజేఐ సమావేశమై వారితో చర్చించారు. వారి డిమాండ్ ను పరిగణలోకి తీసుకుంటామని సీజేఐ సంజీవ్ ఖన్నా హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

**ఇంట్లో నోట్ల కట్టలు..!**

కాగా, ఇటీవల జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న సమయంలో



భారీగా నోట్ల కట్టలు బయటపడ్డాయి. దాని విలువ సుమారు రూ. 15 కోట్లు ఉంటుందని అంచనాలు కూడా వేశారు. ఒక న్యాయమూర్తి వద్ద అంత డబ్బు ఎలా వచ్చిందంటూ చర్చ మొదలైంది. అదే సమయంలో ఇది కచ్చితంగా అవినీతి చేసే కూడపెట్టిందని వాదన బలంగా వినిపించింది. ఈ క్రమంలోనే ఆరు రాష్ట్రాలకు చెందిన బార్ అసోసియేషన్ అధ్యక్షులతో సీజేఐ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జస్టిస్ యశ్వంత్ వర్మ బదిలీని కొన్నాళ్లపాటు నిలుపుదల చేయడమే సమంజసమా?, బదిలీ చేసి అక్కడ జ్యుడిషియల్ వ్యవహారాలు అప్పగించకుండా ఉండేలా చేయడమే కరెక్టా అనే కోణంలో వీరు చర్చించినట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగానే జస్టిస్ యశ్వంత్ పై విచారణ పూర్తయ్యేవరకూ ఎటువంటి బాధ్యతలు కేటాయించవద్దని అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సూచించినట్లు సమాచారం.

# బేస్‌మెంట్ పూర్తయితే వెంటనే రూ. 1,00,000

### ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ వేగవంతం చేయాలి..

### ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశంలో మంత్రులు,

### ఎమ్మెల్యేలతో సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్లను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన గ్రామాల్లో.. ఇళ్ల గ్రౌండింగ్ పనులు వేగవంతం చేయాలని రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 516 గ్రామా ల్లో ఒకేసారి మంజూరు చేసిన ఇళ్లను వెంటనే పనులు ప్రారంభించాలని, ఇదివరకే ఒకవేళ నిర్మాణాలు ప్రారంభించి..బేస్‌మెంట్ వరకు పూర్తయిన వారికి రూ.లక్ష తక్షణమే ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. శుక్రవారం సచివాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఆయన సహచర మంత్రులు సీతక్క, కొండా సురేఖలతోపాటు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో కలిసి సమీక్షించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రభుత్వానికి ప్రాధాన్యత అంశమని, దీనిని దృష్టిలో పెట్టుకొని కలెక్టర్లు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం నాలుగు విడతల్లో డబ్బు చెల్లిస్తుందని, మొదటి విడతలో బేస్‌మెంట్ లెవల్ పూర్తయిన తర్వాత రూ.లక్ష, ఇస్తుందని ఆ వివరాలను వెంటనే పంపించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఇళ్ల స్థలాలు లేని అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇప్పటి వరకు కేటాయించని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని చెప్పారు. నిర్మాణం పూర్తికాక, కేవ లం గోడలు నిర్మించి కాంట్రాక్టర్ వెళ్లిపోతే. అలాంటి ఇళ్లను లబ్ధిదారులే నిర్మించునేలా అవసరమైన ఆర్థిక సహాయం ప్రభుత్వం చేస్తుందని మంత్రి చెప్పారు.

**తాగునీటి సమస్య లేకుండా...**

వేసవిలో ఏ గ్రామంలో లేదా పట్టణాల్లోగాని తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. వచ్చే మూడు నెలలు చాలా కీలకమని, ప్రజలు తాగునీరు రావడం లేదన్న విమర్శ రాకుండా పనిచేయాలని సలహా ఇచ్చారు. నీటికొరత ఉన్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేయడం, చెడిపోయిన బోర్లు, హ్యాండ్ పంప్‌లకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

**జూన్‌లోగా వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పూర్తి**

వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ భవన నిర్మాణ పనులను రెండు నెలల్లో పూర్తిచేసి..జూన్ చివరినాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. మడికొండ డంపింగ్ యార్డు సమస్యకు వారం రోజుల్లో తాత్కాలిక పరిష్కారం చూపించి, ఆ తర్వాత శాశ్వత పరిష్కా రానికి చర్యలు తీసుకోవాలన్నారు. మునిసిపల్ కమిషనర్, డైరెక్టర్ శ్రీదేవి అక్కడ పర్యటించాలని మంత్రి సూచించారు. డంపింగ్ యార్డుకు 150 నుంచి 200 ఎకరాల భూమిని సేకరించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, దొంతి మాధవరెడ్డి, నాగరాజు, మురళీనాయక్, రామచంద్రనాయక్, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణ, ఎమ్మెల్సీ బసవ రాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఉన్నతాధికారులు దానకిశోర్, హరిచందన, కర్ణన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉగాది తర్వాత ఏఐ సిటీకి శంకుస్థాపన

### పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడి

### క్లియర్‌టెల్లిజెన్స్ ఇండియా డెలివరీ అండ్ ఆపరేషన్స్ సెంటర్ ప్రారంభం

హైదరాబాద్: ఉగాది తర్వాత ఏఐ సిటీ నిర్మాణానికి మహేశ్వరంలో భూమిపూజ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి శ్రీధర్‌బాబు చెప్పా రు. మాదాపూర్‌లోని ఐటీసీ కోహినూర్‌లో శుక్రవారం క్లియర్‌టెల్లిజెన్స్ ఇండియా డెలివరీ అండ్ ఆపరేషన్స్ కేంద్రాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భావితరాల అవసరాలకు అనుగుణంగా, సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీలోనే 200 ఎకరాల్లో ఏఐ సిటీని నిర్మిస్తున్నట్లు వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఐ సిటీ నిర్మితం అవుతుందని.. ఈ సిటీలో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే టెక్ దిగ్గజ సంస్థలు ఆసక్తి వ్యక్తం చేశాయని మంత్రి తెలిపారు. ఏఐ, డేటా ఇంజనీరింగ్, బిజినెస్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ సొల్యూషన్స్ తదితర రంగాల్లో సేవలు అందించే క్లియర్ టెల్లిజెన్స్ సంస్థ తమ భారత శాఖను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడంపై శ్రీధర్‌బాబు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్లియర్ టెల్లిజెన్స్ సీఈఓ ఓవెన్ ఫ్రివోడ్, మేనేజింగ్ పార్ట్‌నర్ అనిల్ భరాడ్వా, డైరెక్టర్ మురళి తదితరులు పాల్గొన్నారు.




# జేఈఈ మెయిన్స్ తేదీల్లో మార్పులు?

### ఏప్రిల్ 2 నుంచి జరగాల్సిన పరీక్ష..

### అదే రోజు సీబీఎస్ఈ పరీక్ష

### రెండూ ఎలా రాస్తామంటున్న విద్యార్థులు

హైదరాబాద్: జేఈఈ మెయిన్స్%-%2 పరీక్ష తేదీలు మారే అవకాశం కన్పిస్తోంది. దీనిపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్ణయం వెల్లడించాల్సి ఉంది. వాస్తవానికి ఏప్రిల్ 2, 3, 4, 7, 8 తేదీల్లో రెండో విడత జేఈఈ మెయిన్స్ జరగాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన అడ్మిట్ కార్డులను శనివారం విడుదల చేస్తామని ఎన్‌టీఏ ప్రకటించింది. అయితే ఇదే రోజు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) పరీక్ష ఉంటుంది. సీబీఎస్ఈ ఫిబ్రవరి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించింది. దీని ప్రకారం ఏప్రిల్ 2న లాంగ్వేజెస్, 3న హెూం సైన్స్, 4న ఫిజియాలజీ ఉంటుంది. సీబీఎస్ఈ పరీక్ష ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కొనసాగుతుంది. జేఈఈ మెయిన్స్ పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మరో షిఫ్ట్ సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకు ఉంటుంది. దీంతో సీబీఎస్ఈ పరీక్ష రాసే విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌కు హాజరయ్యే అవకాశం లేకుండా పోతుంది. లేదా మెయిన్స్ రాసే విద్యార్థులు సీబీఎస్ఈ పరీక్షను



వదిలేయాల్సి ఉంటుంది. పలువురు విద్యార్థులు ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శుక్రవారం ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వ అధికారులు టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పరీక్ష మార్పు లేదా ప్రత్యామ్నాయాలపై నిర్ణయం ప్రకటించాలని కేంద్రం ఎన్‌టీఏకి సూచించింది.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గుడ్ న్యూస్

ఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం శుభవార్త చెప్పింది. అదనపు 2 శాతం డీఏ పెంపునకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.దీంతో ప్రస్తుతం ఉన్న డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ) 53 శాతం నుంచి 55 శాతానికి పెరిగినట్లైంది. రెండు శాతం డీఏ పెంపు ద్వారా 48.56 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, 66.55 లక్షల మంది పెన్షనర్లకు లాభం చేకూరనుంది. తాజా కేబినెట్ నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వంపై రూ.6వేల 614 కోట్ల భారం పడనుండగా.. పెరిగిన డీఏ జనవరి 2025 నుంచి అమల్లోకి రానుంది.

**రైతులపై భారం తగ్గించేందుకు**

రైతులపై భారం తగ్గించేందుకు పోషక ఆధారిత ఎరువులపై సబ్సిడీ ఇస్తున్న కేంద్రం ఇస్తుంది. అయితే, ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పోషక ఆధారిత పీఅండ్‌కే ఎరువులకు సబ్సిడీ (రూ. 37,216 కోట్లు) మంజూరు చేసింది. న్యూట్రియంట్ బేస్డ్ సబ్సిడీ పథకం కింద 28 రకాల పోషక ఆధారిత ఎరువుల గరిష్ట చిల్లర ధరను తయారీదారులు/దిగుమతిదారులు తగినంత స్థాయిలో నిర్ణయించేందుకు అనుమతి ఇచ్చింది. కోవిడ్ సంవత్సరాల నుండి, అంతర్జాతీయ మార్కెట్‌లో అధిక స్థాయికి డీఏపీ ధరలు పెరిగాయి. తాజాగా, కేబినెట్‌లో రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు, ధరల అస్థిరత ప్రభావాన్ని తగ్గించేందుకు డీఏపీ గరిష్ట చిల్లర ధర 50 కిలోల బ్యాగ్‌కు రూ.1,350 కు పరిమితం చేసింది.

# భారీ భూకంపం ధాటికి మయన్మార్‌లో 25మంది మృతి

ప్రార్థనా మందిరాలు, గోపురాలు కూలిపోయాయి. భూకంపం నేపథ్యంలో, మయన్మార్ సైనిక ప్రభుత్వం అంతర్జాతీయ సాయం కోరింది. మానవతా దృక్పథంతో సాయం అందించాలని ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేసింది.

**బ్యాంకాక్‌లో ముగ్గురి మృతి**

థాయిలాండ్ లోనూ ఇవాళ భూకంపం సంభవించిన సంగతి తెలిసిందే. రాజధాని బ్యాంకాక్ లో ఓ భారీ భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో ముగ్గురు మరణించారు. ఈ భవనం శిథిలాల్లో 80 మంది చిక్కుకున్నట్టు థాయిలాండ్ ప్రభుత్వం ప్రకటించింది. సహాయక సిబ్బంది ఇప్పటివరకు ఏడుగురిని కాపాడారు.

**ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ ఏర్పాటు చేసిన భారత్**

థాయిలాండ్ లో భారతీయుల సహాయార్థం ఎమర్జెన్సీ హెల్ప్ లైన్ ఏర్పాటు చేశారు. భూకంపం ప్రభావానికి గురైన భారతీయులు ఈ హెల్ప్ లైన్ సేవలు వినియోగించుకోవాలని థాయిలాండ్ లోని భారత ఎంబసీ పేర్కొంది. థాయిలాండ్ లోని భారత ఎంబసీ ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ నెంబర్: ౦66 618819218

# అక్కడ 400 ఎకరాల భూమిని అమ్మడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా: కేటీఆర్

సరీసృపాలు, ఇంకా 200లకు పైగా పక్షి జాతులు నివసిస్తున్నాయి. అంతేకాకుండా, ఆ ప్రాంతంలోని శిలా నిర్మాణాలు బిలియన్ సంవత్సరాల చరిత్రను కలిగి ఉన్నాయి" అని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ ప్రాంతం పర్యావరణపరంగా ఎంతో ముఖ్యమైనదని ఆయన నొక్కి చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు ప్రకృతి రక్షణ గురించి మాట్లాడుతున్న ప్రభుత్వం, మరోవైపు ప్రకృతిని నాశనం చేసేందుకు సిద్ధం కావడం విడ్డూరంగా ఉందని ఆయన అన్నారు. "ఈ భూమిని వాణిజ్య కేంద్రంగా మార్చి, భారీ భవనాలు, షాపింగ్ మాల్స్ నిర్మించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇది నగర భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తుంది" అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అవివేకపు విధానాన్ని వెంటనే విరమించుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో పర్యావరణ పరిరక్షణకు తీసుకున్న చర్యలను కేటీఆర్ గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఈ భూమి అమ్మకం వెనుక ఉన్న ప్రభుత్వ ఉద్దేశాలను ప్రశ్నించారు.



# పెద్దపల్లి జిల్లాలో పరువుహత్య

నలుగురు స్నేహితులు పూరెల్ల అఖిల్, చిలుమల హన్సిక్, కామెర అభిషేక్, చెవుల రాకేశ్‌తో కలిసి కేక్ కట్ చేశాడు. ఆపై స్నేహితులంతా మద్యం తాగేందుకు సిద్ధమయ్యారు. స్నాక్స్ కోసం రాకేశ్, అభిషేక్ కిరాణా దుకాణానికి వెళ్లగా.. అదే సమయంలో అక్కడికి చేరుకున్న యువతి తండ్రి వెంట తెచ్చుకున్న గొడ్డలితో సాయికుమార్‌పై దాడి చేశాడు. సాయికుమార్ ప్రాణభయంతో పరుగులు తీసినా సుమారు 200 మీటర్లు వెంటాడి గొడ్డలితో వేటు వేశాడు. ఈ క్రమంలో స్నేహితుడు అఖిల్ సదయ్యను అడ్డుకొని అతన్నుంచి గొడ్డలిని లాక్కున్నాడు. రక్తపుమడుగులో సాయికుమార్ కొట్టుమిట్టాడుతుండటంతో సదయ్య అక్కడి నుంచి నుంచి పారిపోయాడు. దాడి విషయాన్ని స్నేహితులు సాయికుమార్ తండ్రి పర్శరాములుకు తెలియజేశారు. కుటుంబ సభ్యులతో కలిసి సాయికుమార్‌ను సుల్తానాబాద్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శుక్రవారం పోస్ట్‌మార్టం అనంతరం ముప్పిరితోటలో అంత్యక్రియలు నిర్వహించారు. పర్శరాములు ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు సదయ్య కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. అయితే నిందితుడు జూలిపల్లి పోలీసుల ఎదుట లొంగిపోయాడని సమాచారం. సదయ్యగా భావిస్తున్న వ్యక్తి పోలీసుల అదుపులో ఉన్నట్లు ఓ వీడియో క్లిప్ వైరల్‌గా మారింది.

**వెంటాడిన మృత్యువు..**

గురువారం తెల్లవారుజామున బాబాయ్ భరత్‌కు కిడ్నీలో నొప్పి వస్తోందని చెప్పడంతో సాయికుమార్ ఆయన్ను తీసుకొని కారులో కరీంనగర్ ఆస్పత్రికి బయల్దేరాడు. మార్గమధ్యలో దుబ్బపల్లి వద్ద కారు బోల్తాపడి రెండు పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో భరత్‌కు స్వల్ప గాయాలవగా సాయికుమార్ సురక్షితంగా బయటపడ్డాడు. కానీ రాత్రికి మాత్రం దారుణ హత్యకు గురయ్యాడు. సాయికుమార్ చెల్లెలు 2016లో డెంగీతో మరణించగా ప్రస్తుతం కొడుకు సైతం మరణించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# హస్తినాపురం డివిజన్ అభివృద్ధి కోసం 16 కోట్ల 12 లక్షల నిధులు మంజూరు

## నిధుల మంజూరుకు సహకరించిన మధుయాష్కి గౌడ్ కి కృతజ్ఞతలు తెలిపిన హస్తినాపురం కార్పొరేటర్ సుజాత నాయక్



ఎల్బీనగర్ 28 మార్చి:హస్తినాపురం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలో అభివృద్ధి పనులకు 16 కోట్ల 12 లక్షల 62 వేలు మంజూరైనట్లు జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మధు యాష్కి గౌడ్ సహకారంతో నిధులు మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సహచర మంత్రులకు ధన్యవాదములు తెలిపారు. 12 కోట్ల 50 లక్షలతో ఏపీ ఎస్బీ కాలనీ నుండి బైరా ముల్ గూడా చెరువు వరకు వరద నీటి కాల్వ నిర్మాణానికి నిధులు మంజూరు అయినట్టుగా తెలిపారు. అదే విధంగా శ్రీ రమణ కాలనీ లో సీసీ రోడ్డు నిర్మాణానికి 89 లక్షల 37 వేలు ఆర్ కె ఆర్ ఎంక్లేవ్ లో బీటీ రోడ్ మరమ్మత్తులకై 15 లక్షలు భీమా నగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 30లక్షలు అగ్రికల్చర్ కాలనీలో సిసి రోడ్డు నిర్మాణాలకు 81 లక్ష,50 వేలు విజయదుర్గా కాలనీ సిసి రోడ్డు నిర్మాణానికి 35 లక్షలు, శివ సాయి నగర్ సిసి రోడ్డు నిర్మాణానికి 25 లక్షలు దాతునగర్ రోడ్ నెంబర్ 1 వెంకటేశ్వర కాలనీ రోడ్ నెంబర్ 3 శ్రీరామ అయోధ్య కాలనీ శ్రీ రమణ కాలనీ ఫేస్ 1 లలో రోడ్ల నిర్మాణానికి 86 లక్షల 75 వేల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం తో పాటు ఎల్బీనగర్ నియోజకవర్గం అభివృద్ధి ముమ్మరంగా జరుగుతుందని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆమె పేర్కొన్నారు.

# బిఆర్ఎస్, కాంగ్రెస్ రెండు పార్టీలు ఓవైసీ బ్రదర్స్ మెప్పు కోసం పని చేసే పార్టీలే - రాణి రుద్రమ రెడ్డి

## రెండో రోజు కొనసాగిన బిజెపి నేతల రిలే నిరాహార దీక్షలు -మద్దతు తెలిపిన బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధులులి




వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి..( సంగిశెట్టి ధనుంజయ్ నేత ) ..మార్చి : 28 ...
మహేశ్వరం నియోజకవర్గం మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు బిక్షపతి చారి మరియు ముఖేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో పేద ప్రజలపై పెంచిన ఇంటి పనుల భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ రెండవ రోజు రిలే నిరాహార దీక్ష కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కొనసాగించారు వారికి మద్దతుగా బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధులు రాణి రుద్రమ రెడ్డి మరియు గంగాపురం వెంకట్ రెడ్డి లిబిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ తో కలిసి హాజరై సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాణీ రుద్రమ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ మరియు కాంగ్రెస్ పార్టీలో ఓవైసీ బ్రదర్స్ మెప్పుకోసం పనిచేసే పార్టీలే తప్ప పేద ప్రజల అవసరాలు పట్టించుకునే పార్టీలు కావని అన్నారు. గతంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేసిందని ఇప్పుడు రేవంత్ సర్కార్ కూడా అదే పాలన కొనసాగిస్తున్నారని, అప్పుల మీద అప్పులు చేస్తూ దాని భారాన్ని పేద ప్రజలపై పన్నుల రూపాన వసూలు చేసి పీడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డి పేద ప్రజల పక్షాన పోరాడాల్సిన బాధ్యతను మరిచారని అన్నారు. పెంచిన ఇంటి పన్నులను తగ్గించేంతవరకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకత్వం నుండి పూర్తి మద్దతు ఉంటుందని పేదల పక్షాన పోరాడే భారతీయ జనతా పార్టీ ఎక్కడ వెనుకడుగు వేయదని తెలిపారు. వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం దిగి వచ్చి పేద ప్రజల పన్నుల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్లు, మాజీ కార్పొరేటర్లు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, మాజీ ప్రధాన కార్యదర్శులు, పార్టీ సీనియర్ నాయకులు, మహిళా మోర్చా సభ్యులు, బీజేవైఎం నాయకులు మరియు పలు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# బాలాపూర్ రైతులందరికి రుణమాఫీ చెయ్యాలని ఎమ్మెల్యే కి వినతి



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి..( సంగిశెట్టి ధనుంజయ్ నేత ) ..మార్చి : 28 ...
బాలాపూర్ మండలం లో అందరికీ రుణ మాఫీ కాలేదు అని , రైతు భరోసా ను అందరికీ వెంటనే వేయాలి అని ది భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ నరసింహ రెడ్డి అన్నారు. శుక్రవారం మీర్పేట్ లోని క్యాంపు కార్యాలయంలో మహేశ్వరం శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి కి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా చైర్మన్ నరసింహారెడ్డి మాట్లాడుతూ ది భాగ్యనగర్ రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్ పరిధి లోని బాలాపూర్ , సరూర్ నగర్ లలో సంఘం యొక్క సర్వ సభ్య సమావేశము ఏర్పాటు చేయడం జరిగిందని, సమావేశములో నాదర్ గుల్, కుర్మల్ గూడ , బడంగ్ పేట్ రైతులు పాల్గొని ఋణ మాఫీ, రైతు బరోస ఇవ్వడము లేదని సమావేశము జరగకుండ అడ్డుపడినారు.మా సంఘంలో 321 మంది కి రూ . 212, 52, 872 మాఫీ కొరకు ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. కానీ 221 మంది రైతులకు రూ. 138, 72, 188 మాఫీ చేయడం జరిగిందని అన్నారు. ఇంకా రుణమాఫీ కానీ వారు 140 మంది రైతులు ఉన్నారని రూ .73 80 684 మాఫీ కావలసి ఉందని తెలిపారు. మాఫీ అయ్యేటట్లు చూడాలని సబిత ఇంద్రారెడ్డికి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ కూడా రైతుబంధు గానీ రైతు రుణమాఫీ గాని జరగలేదని అన్నారు. ప్రభుత్వము గొప్పలకు పోయి అందరికీ రుణమాఫీ చేశామని చెప్తుందన్నారు. దాదాపు 50 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. ప్రభుత్వం ఆర్భాటాలకు పోకుండా ఇచ్చిన హామీ ప్రకారం వెంటనే రుణమాఫీ చేయాలని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రంలోని రైతాంగానికి ఒక రోజులో రైతుబంధు డబ్బులు వారి అకౌంట్లో పడేవని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతు భరోసా ఎప్పుడు వేస్తున్నారో కూడా వారికి అర్థం కావడం లేదన్నారు. వెంటనే రైతుబంధులు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.రాబోవు ఖరీఫ్ సీజన్లో వ్యవసాయ ఖర్చులు ఇతర ఎరువులు,విత్తనాలు కొనుగోలు చేయవలసి ఉంటుంది అని, రైతులకు ఇబ్బంది అవ్వకుండా త్వరగా ఋణ మాఫీ,రైతు భరోసా ఇవ్వాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బడంగ్ పేట్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి, మీర్పేట్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అర్కల కామేష్ రెడ్డి , బిమిడి జాంగా రెడ్డి, నరేందర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, బొక్క రాజేందర్ రెడ్డి, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్న బీజేపీ నాయకులు

## కాంగ్రెస్ పార్టీది అభయహస్తం కాదు భస్మాసుర హస్తం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి



సంస్థాన్ నారాయణపురం మార్చ్ 28:( వార్త మిర్రర్ )
తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అభయ హస్తం పేరుతో ఇచ్చిన 6 గ్యారెంటీలలో ఏ ఒక్కటి నెరవేర్చకపోవడంతో నారాయణపురం మండలం గుజ్జ గ్రామంలో భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షులు సుర్వి రాజుగౌడ్ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలపై ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ మహిళలకు మహాలక్ష్మి పథకం కింద 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకు 2500 రూపాయలు,వృద్ధులకు ఆసరా పింఛన్ 4000 రూపాయలు ఇస్తానని బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారు. అప్పటి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నేటి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల మేనిఫెస్టో లో 6 గ్యారంటీలా ద్వారా ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందిస్తామని అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తున్నారు.ఆడపిల్లల పెళ్లిళ్లకు తులం బంగారం ఇస్తాము అన్నారు. ఆ యొక్క పథకాలను వెంటనే అమలు చేయాలని గుజ్జ గ్రామంలో ప్రజల తరపున భారతీయ జనతా పార్టీ దరఖాస్తులు స్వీకరిస్తున్నామని దానికి ప్రజల తరపునుండి అనూహ్య స్పందన ఉన్నది.ఈరోజు మేము తీసుకున్న దరఖాస్తులను ప్రజల తరపున మండల తహసీల్దార్ కి, జిల్లా కలెక్టర్ కి భారతీయ జనతా పార్టీ సంస్థాన్ నారాయణపురం మండల శాఖ ఆధ్వర్యంలో అందజేస్తాము. ఆ రోజు నుండి మండలం లోని ప్రతి గ్రామం లో ప్రజలు నుండి దరఖాస్తులు తీసుకొనున్నాము ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. అంతేకాకుండా ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినటువంటి ఆరు గ్యారంటీలలో అమలు కానీ ఇతర అనేక పథకాలు, రైతుల సమస్యలు, నిరుద్యోగుల సమస్యలు,విద్యార్థుల సమస్యల పట్ల భారతీయ జనతా పార్టీ అలుపెరుగని పోరాటాలు చేస్తుంది. ఆచరణ సాధ్యం కానీ హామీలను ప్రజలు గ్రహించి గారడీ మాట్లాలా పార్టీలకు బుద్ది చెప్పాలి అని అన్నారు. గ్రామాల్లో నిర్మించే సీ.సీ రోడ్డుల నిధుకు కేంద్ర ప్రభుత్వం పథకాల నిదులేనాని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షం గౌడ్,గుజ్జ బిజెపి నాయకులు కుకుడాల మహేందర్ రెడ్డి,ఎలిజాల శీను,జిల్లా నాయకులు భాస్కర నరసింహ,వంగరి రఘు, నందగిరి జగత్ కుమార్,మండల నాయకులు సంపతి సుధాకర్ రెడ్డి,భూసా శీను, కట్కూరి వెంకటయ్య గౌడ్,ఆత్కూరి రాములు, గోధుమ గడ్డ వెంకట్ రెడ్డి,గూడూరు మంజునాథ్ రెడ్డి,బద్దం యాదయ్య గౌడ్,కట్కూరి శ్రీకాంత్ గౌడ్,ఓర్సు విజయ్, ఎర్ర వెంకటేశం, మల్లె నరేందర్ రెడ్డి,చాడ రాములు, చాడ అంజయ్య, పడసనబోయిన యాదగిరి,బంగారు నవీన్, చిలువేరు సతీష్,బొద్దుల సాంబశివ,పోలోజు వెంకటేష్,చాడ శ్రీశైలం, పడసనబోయిన శంకర్,బంగారు వేణు,నీళ్ల అంజయ్య పాల్గొన్నారు.

# డ్వాక్రా మహిళలల వన భోజనాలలో పాల్గొన్న సబితా ఇంద్రారెడ్డి



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి..( సంగిశెట్టి ధనుంజయ్ నేత ) ..మార్చి : 28 ...
మహేశ్వరం నియోజకవర్గం బడన్గ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ లో డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన వన భోజనాలలో పాల్గొన్న మాజీ మంత్రి మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ కార్తీకమాసములో బంధువులు, స్నేహితులతో కలసి చెట్ల నీడలో (ప్రత్యేకించి ఉసిరి చెట్టు నీడన) కలసి భోజనం చేయటాన్ని వన భోజనం అంటారని. ప్రకృతితో మన బంధాన్ని గుర్తుచేసుకునే రోజుగా చెప్పవచ్చన్నారు. వన భోజనాలు చేయడంవలన మన ఆరోగ్యం మాత్రమే కాదు, ప్రకృతిని కాపాడుకున్న వాళ్ళం అవుతామని. పర్యావరణ పరిరక్షణ అనే భావన ఈ వనభోజనాలలో అంతర్లీనంగా ఉందని. ప్రకృతిని మనం కాపాడుకుంటే ప్రకృతి మనల్ని కాపాడుతుందనే సందేశం ఈ వనభోజనాలలో దాగి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# దాశవ్వకు అండగా ఉంటా మాజీ ఎంపిటిసి బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు శివరాత్రి కవిత విద్యాసాగర్

సంస్థాన్ నారాయణపురం, మార్చి 28:( వార్త మిర్రర్) నారాయణపురం మండలం కేంద్రానికి చెందిన వృద్ధురాలు దాశవ్వకు గత ఎనిమిది నెలల నుండి వృద్ధాప్య పింఛన్ నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న. విషయం తెలుసుకున్న గుడిమల్కాపురం మాజీ ఎంపిటిసి బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు శివరాత్రి కవిత విద్యాసాగర్ దాశవ్వకు రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు తెలంగాణ బిక్షం, ప్రధాన కార్యదర్శి ఎడ్ల సత్తయ్య,ఉప్పల శ్రీను, రాసాల వెంకటేష్, చిలువేరు శంకర్,జనగాం నరసింహ, సంద శ్రీకాంత్, సాయికిరణ్ పాల్గొన్నారు.

# నేతాజీ యువజన సమాఖ్య ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం



సంస్థాన్ నారాయణపూర్ మార్చి 28 :( వార్త మిర్రర్) యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణ పురం మండల కేంద్రంలో నేతాజీ యువజన సమాఖ్య ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని నారాయణ పురం గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతాజీ యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషం అన్నారు.ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చినందుకు నేతాజీ యువజన సమాఖ్య సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ పందుల కార్తీక్ గౌడ్,మొగుదాల ప్రదీప్, జనగాం నర్సింహ, మొగుదాల సత్తయ్య, మురరిశెట్టి వెంకటయ్య, ఏపూరి సతీష్,ఎండి అక్బర్ అలీ,కొండ శ్రీనివాస్,ఉప్పల నాగరాజు,కొండ శ్రీకాంత్, ఎస్ కే పాషా, కారోబర్ ముత్యాల చంద్రకాంత్, బైకని నరేందర్, చిలివేరు శంకర్,రెవనపల్లి బిక్షం,రావుల ఆటో అంజి తదితరులు పాల్గొన్నారు

# మంత్రి జూపల్లి కృష్ణారావుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసిన భూక్య సంతోష్ నాయక్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి గణేష్ సాగర్
యాదాద్రి భువనగిరి జిల్లా లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు భూక్య సంతోష్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీలో నిన్న బంజారాల(గోర్ బోలి) భాషను ఎనిమిదో షెడ్యూల్లో చేర్చుటకు తీర్మానం చేయడం జరిగింది,అసెంబ్లీలో తీర్మానం ప్రవేశ పెట్టిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, తీర్మానం ప్రవేశపెట్టిన రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు కి,ఆమోదించిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలంగాణ రాష్ట్ర లంబాడి హక్కుల పోరాట సమితి కమిటీ తరుపున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేశారు, ఎన్నో ఏళ్ల నుంచి ఈ అంశం మీద కొట్లాడుతున్నాం అనేక ఉద్యమాలు, అనేక ధర్నాలు రాస్తారోకలు నిర్వహించడంజరిగిందని ,ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద లంబాడి హక్కుల పోరాట సమితి మరియు గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం తెలియజేయడం జరిగింది, ఇప్పటికైనా ఆమోదించిన తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దాన్ని పార్లమెంట్లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం తెలపాలని తెలియజేశారు, ఈ దేశంలో హిందీ భాష మాట్లాడే వారి తరువాత, రెండో అతి పెద్ద భాష మాట్లాడేది లంబాడీలు, 15 రాష్ట్రాల్లో ఈ భాష మాట్లాడుతున్నారు, ఎందుకంటే ప్రపంచంలో భిన్న సంస్కృతుల్లో గిరిజన సంస్కృతి ఒకటి, గిరిజనుల వేషాదరణ సంస్కృతి కట్టుబొట్టు వేషధారణ తండా లో సాంప్రదాయం, ప్రకృతిని పూజించే గొప్ప సంస్కృతి, తీజ్ పండుగ, శితల భవాని పండుగ, సేవాలాల్ మహారాజ్ జయంతి, ప్రత్యేకంగా ఉంటుంది కాబట్టి, కాబట్టి అంతరించిపోతున్న ఈ గిరిజన సంస్కృతిని కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది యూనివర్సిటీలో ఏర్పాటు చేసి ఒక డిపార్ట్మెంట్లో పిహెచ్డి రీసర్చ్ చేసే విధంగా పాఠ్యపుస్తకాల్లో ఇట్టి బంజారా చరిత్రను భావితరాలకు అందించాలని తెలియజేశారు,



# మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం నిధులతో సిసి రోడ్లు నిర్మాణం

## రోడ్డు నిర్మాణానికి, త్రాగు నీటి బోర్ వేయుటకు సహకరించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

సంస్థాన్ నారాయణపురం మార్చ్ 28:( వార్త మిర్రర్)
సంస్థాన్ నారాయణపురం మండలం కంకణాలగూడెం గ్రామ పంచాయతీ లోని దేశ్య తండాలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం నిధుల ద్వారా సీసీ రోడ్ల నిర్మాణం చేయడం జరిగింది. గ్రామ ప్రాంతాల అభివృద్ధి ప్రజా పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలపై దృష్టి పెట్టి ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించే విధంగా కృషి చేస్తున్నదని ఈ సందర్భంగా చెప్పారు. అదేవిధంగా వేసవి కాలము లో మంచినీరు దొరకక ప్రజలు అవస్థలు పడుతుంటే మంచినీటి ఎద్దడి నివారణకు స్థానిక శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తమ సొంత నిధులతో బోర్లు వేయించి ప్రజల దహము తీర్చుటకు తీవ్ర కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా చెప్పటం జరిగింది.ఈ యొక్క సీసీ రోడ్ల నిర్మాణం పనులకు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మందుగుల బాలకృష్ణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎం డి అక్బర్ అలీ,ఐ.ఎన్.టి.యు.సి జిల్లా ఉపాధ్యక్షులు కంకణాలగూడెం మాజీ సర్పంచ్ కరెంటోతు ప్రజ్ఞా నాయక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ ఏపూరి సతీష్ నారాయణపురం. మాజీ సర్పంచ్ కొనిరెడ్డి నర్సింహా మండల యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాచకొండ రమేష్ కంకణాలగూడెం మాజీ సర్పంచ్ శైలజ సత్య నారాయణ కంకణాలగూడెం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి సిరిపంగి బాలకృష్ణ,ఆర్. టి.సి - ఐ.ఎన్.టి.యు.సి స్టేట్ ఉపాధ్యక్షుడు ఇదా శంకరయ్య, కడ్తాల నర్సింహా, బూరుగు అంజయ్య,సిరిపంగి పెంటయ్య, కడ్తాల చంద్రయ్య,దారావత్ లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి మాధవ రెడ్డి, కడ్తాల కిషోర్ పార్టీ కార్యకర్తలు మరియు గ్రామ పెద్దలు మహిళలు పలుకొనడం జరిగింది.

# తొలి ఉగాది.

# పుడమి ఆకు పచ్చని చీర కట్టుకుని

### స్వా గతం సుస్వా గతం తెలుపగా వచ్చింది తొలి ఉగాది



ఇంద్రుడు మేఘ మాలికల విల్లులతోతుంపర, తుంపరులుగాచినుకుల బాణాలు విడుస్తూ ...స్వా గతం సుస్వా గతం తెలుపగావచ్చింది తొలి ఉగాది..!పండిన కొత్త చింత పులుపు వగరు మామిడి ఉరింపులు పలుకగా భిన్నసంస్కృతులకు బహు పునాది వేస్తూ వచ్చింది తొలి ఉగాది..!సంస్కృతి సంప్రదాయాలను ఒకటిగా చేసి చైత్ర మాసపు ఊసులు చెప్తూ గండు కోయిల తీయని పాటలతో స్వాగతం సుస్వాగతం పలుకగావచ్చింది తొలి ఉగాది..!పంచభూతాలు దీవించగా...చావిడలో పంచాంగ శ్రవణాలుస్వా గతం సుస్వా గతం తెలుపగావచ్చింది తొలి ఉగాది..!తెలుగు లోగిళ్లలోన మామిడితోరణాలు,షడ్రురుచులతో ఉగాదిపచ్చడి...స్వా గతం సుస్వా గతం తెలుపగావచ్చింది తొలి ఉగాది..!మీకు మీ కుటుంబ సభ్యులకు విశ్వావసు నామ సంవత్సరఉగాది పండుగ శుభాకాంక్షలు 2025 శీర్షిక: మంజుల పత్తిపాటి (కవయిత్రి). మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్.




## రేడియో కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులను

## ప్రారంభించిన కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి

### - డివిజన్ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా పని చేస్తానని

### కార్పొరేటర్ రాగుల వెల్లడి

ఎల్బీనగర్, 28 మార్చి:

వనస్థలిపురం డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీకి తమ పదవీ కాలం పూర్తయ్యేలోపు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి చెప్పారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని రేడియో కాలనీ లో సంక్షేమ సంఘం నాయకులతో కలిసి 18,80 లక్షల తో భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. స్థానికంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్రాంతి హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి కాలనీ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డివిజన్ పరిధిలో ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమలో వనస్థలిపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుంట్ల నరసింహ యాదవ్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు కటకం వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎం. కోటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి కే. రవీందర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు ఎల్ సునంద, శక్తి నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు అజయ్ యాదవ్, ప్రేమ్ కుమార్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## సీనియర్ జర్నలిస్ట్, సామజిక

## కార్యకర్త రాపోలు లింగస్వామి కి ఉగాది పురస్కారం

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి..( సంగిశెట్టి ధనుంజయ్ నేత ) ..మార్చి : 28 ...ఉగాది పండుగ ను పురస్కరించుకొని భారత్ టుడే –తెలుగు న్యూస్ , ప్రజా జ్యోతి, దెక్కన్ క్రానికల్, యోయో టీవీ, ఎస్ బీ ఎం, ఎన్ ఆర్ మీడియా ల సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాల అవార్డు( 2025) ల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని గురువారం సికింద్రాబాద్ లో ఘనంగా నిర్వహించడం జరిగింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞ శర్మ హాజరై నిర్వాహకులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.నల్గొండ జిల్లా మునుగోడు మండలం కోతులారం గ్రామానికి చెందిన రాపోలు లింగస్వామి హైదరాబాద్ లో నివసిస్తున్న ఆయనతెలంగాణ జర్నలిస్టుల సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు గా,మెట్రో ఉదయం తెలుగు జాతీయ దిన పత్రిక రంగారెడ్డి జిల్లా జర్నలిస్ట్ గా, సామజిక కార్యకర్తగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్న రాపోలు లింగస్వామి ని తెలుగు ఉగాది బిజినెస్ ఇన్ ఫ్లూ యన్సర్స్ అవార్డు 2025 వరించింది. .ఈ ఈ సందర్భంగా జర్నలిస్టుగానే కాకుండా సమాజ సేవ చేస్తున్న రాపోలు లింగస్వామి స్వచ్ఛందంగా చేస్తున్నటువంటి సేవలను గుర్తించి ఉత్తమ జర్నలిస్టుల కోటాలో ఉగాది పురస్కారాల కమిటీ నిర్వాహకుల చేతుల మీదుగా రాపోలు లింగస్వామి కి ఉగాది పురస్కారం అందించడం జరిగింది.ఈ సందర్భంగా అవార్డు గ్రహీత రాపోలు లింగస్వామి మాట్లాడుతూ తాను జర్నలిస్ట్ గా, చేస్తున్న సేవలను గుర్తిస్తూ ఉత్తమ జర్నలిస్ట్ ఉగాది పురస్కారం అవార్డు( 2025) అవార్డు రావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఉగాది పురస్కారం అవార్డుకు ఎంపిక చేసిన నిర్వాహకుల కు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.



## బాలింగ్ సత్తయ్య గౌడ్

## మెరోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ పోటీలు

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : హాఫిజ్ పెట్ 109 డివిజన్ పరిధిలో ఉన్న ప్రజాసిటీ వెల్ఫేర్ అసోసియేషన్ లో బాలింగ్ సత్తయ్య గౌడ్ మెరోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్ మరియు కాలనీ వాసులతో కలిసి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో ప్రజాసిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాయుడు, కేబుల్ రవి, వెంకటేష్ గౌడ్ శ్రీనివాస్ గౌడ్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# అలంకార ప్రాయంగా డంపింగ్ యార్డ్

### - చెత్తను కాల్చేచేస్తున్న సిబ్బంది

### - నిర్లక్ష్యం వహిస్తున్న సంబంధిత అధికారులు

కల్వకుర్తి మార్చ్ 28 వార్త మిర్రర్ ప్రతినిధి:–ప్రజల ఆరోగ్యంతో పాటు పంచాయితీలకు అదనపు ఆదాయం సమకూర్చాలనే లక్ష్యంతో గత ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ ని అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. నిర్వాహకులు గాలికి వదిలి వేయడంతో అవి నిరుపయోగంగా మారాయి. దీంతో ప్రజాధనం వృధాగా మారింది. గ్రామపంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది తడి పొడి చెత్తను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించి కంపోస్ట్ ఎరువు తయారు చేయాల్సి ఉండగా ఎక్కడ కూడా అమలు కావడం లేదు. నిధులు లేక పారిశుద్ధ్య కార్మికుల కొరతతో లక్ష్యం నెరవేయడం లేదు. ఒక్క షెడ్డు నిర్మాణానికి రూ “2.50 లక్షలు ఖర్చు చేశారు. పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షణ లోపంతో ఈ పథకం నీరుగారిపోయింది. సేంద్రియ ఎరువు తయారు చేయడం కోసం గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులు నిరుపయోగంగా మారాయి.చెత్తను కాల్చేచేస్తున్న సిబ్బంది పర్యవేక్షణ ఎక్కడ..?కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ పథకం కింద తడి పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువును తయారు చేయాలి. ఇలా తయారు చేసిన ఎరువులను రైతులకు విక్రయించి గ్రామపంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చుకోవాలి.కానీ అధికారుల పర్యవేక్షణ లోపంతో ఇది నీరు గారుతుంది. చెత్త సేకరణ వరకే సక్రమంగా సాగుతుండగా దానిని వేరు చేసి వ్యర్థాలను ఎరువుగా తయారు చేసే కార్యక్రమాన్ని చేపట్టడం లేదు.ఇండ్ల నుంచి సేకరించిన చెత్తను ట్రాక్టర్ ద్వారా




తీసుకోవడం డంపింగ్ యార్డ్ లో డంప్ చేస్తున్నారు. తడి పొడి చెత్తని వేరు చేయకుండా కాల్చేస్తున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఇదేవిధంగా కొనసాగుతుంది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకం పూర్తిస్థాయిలో విఫలం అవ్వడానికి కారణం గ్రామ పంచాయతీలో సిబ్బంది కొరత సిబ్బంది తక్కువగా ఉండడంతో పంచాయతీ కార్యదర్శులపై పని భారం ఎక్కువగా పడుతుంది. ముఖ్యంగా చాలా చోట్ల నీటి వసతే లేదు. ఈ సమస్యల పరిష్కారానికి ఉన్నత అధికారులు చొరవ చూపి చర్యలు చేపడితే ప్రభుత్వం అనుకున్న లక్ష్యంనికి అనుగుణంగా చేరుకుంటుంది. ఈ విషయం పై వార్త మిర్రర్ ప్రతినిధి %వీూా% కి చరవాణి ద్వారా వివరణ అడగగా స్పందిస్తూ కార్యదర్శిలతో మీటింగ్ పెట్టి తడి,పొడి చెత్త వేరు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

## రంజాన్ పండుగకు ఇబ్బందులు లేకుండా వసతుల కల్పన.... జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి.

మాదాపూర్ వార్త మిర్రర్ : రంజాన్ పండుగను పురస్కరించుకొని మసీదు వద్ద ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు వసతులను కల్పిస్తామని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రత్యేక ప్రార్థనలు ,వేడుకల నిర్వహణకు ఎటువంటి సమస్యలు లేకుండా అన్ని సౌకర్యాలను జిహెచ్ఎంసి పరంగా కల్పిస్తామన్నారు. జోన్ పరిధిలోని మాదాపూర్ డివిజన్ కాకతీయ హిల్స్ అలంగీర్ మసీదును అధికారుల బృందం, మసీద్ ట్రస్ట్ సభ్యులతో కలిసి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదు వద్ద ప్రత్యేక పారిశుధ్య చర్యలను చేపట్టాలని ,పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు .వీధి దీపాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని ,గుంతలు పడ్డ రహదారులకు తక్షణ మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో మసీదుకు ప్రార్థనలు చేసేందుకు ముస్లింలు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి ఆదేశించారు. కాకతీయ హిల్స్ రోడ్ నెంబర్ 11 నుంచి శ్రావణి హాస్పిటల్ గుట్టల బేగంపేట్ వరకు అనుసంధాన రహదారి నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని ,నాణ్యతతో సకాలంలో పూర్తిచేసే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన స్పష్టం చేశారు. పనులపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని పేర్కొన్నారు . అలాగె మియాపూర్ లో ఉన్నటువంటి



చెరువులు పెదకుడి చెరువు, పటేల్ చెరువు, కుడికుంట చెరువులను పరిశీలించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఉప కమిషనర్ మోహన్ రెడ్డి ,ఏసిపి నాగిరెడ్డి ,డి ఈ శ్రీదేవి ,వైద్యాధికారి డాక్టర్ రవి ,ఏఈ ప్రశాంత్ ,ఈద్గా కమిటీ ప్రతినిధులు రియాజ్ ,తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం మైనార్టీలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలు నాయక్:

దేవరకొండ మార్చి 28 వార్త మిర్రర్ :

దేవరకొండ పట్టణ పరిధిలోని ఈద్గా మరియు మక్కా మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిత్యావసర సరుకుల (తోఫా) పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై, ముస్లిం మైనార్టీలకు నిత్యావసర సరుకు పంపిణీ చేసి,ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ...లి పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లిం సోదర సోదరీమణులు నిష్టతో కఠిన ఉపవాసాన్ని ఆచరిస్తారని పేర్కొన్నారు. ఈ రంజాన్ మాసం సమాజంలో సామరస్యాన్ని, సంతోషాన్ని, సౌభ్రాతృత్వాన్ని పెంపొదిస్తుందని తెలిపారు.ప్రజా ప్రభుత్వంలో నెరవేరుతున్న ఉద్యమకాంక్ష నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోసం 6 వేల కోట్ల రూపాయలతో రాజీవ్ యువ వికాసం.ఈ కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, పీఏసిఎస్ చైర్మన్ డాక్టర్ వెణుధర్,మున్సిపల్ వైస్ చైర్మన్ రహత్ అలీ,పట్టణ మాజీ సర్పంచ్ పున్న వేంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు హన్మంతు వెంకటేష్ గౌడ్,యూత్ కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ,ఈద్గా కమిటీ అధ్యక్షులు




సయ్యద్ అజ్జిమొద్దీన్,కార్యదర్శి ఇలియాజ్ పటేల్,ఉపాధ్యక్షులు ఖదీర్, యండి సబీర్, ఎలియజ్ బాబా,%ూఖ% బురాణోద్దీన్, మైనార్టీ నాయకులు ఖాజా,మార్కెట్ కమిటీ డైరెక్టర్ దస్తగిరి,యూత్ కాంగ్రెస్ నాయకులు ఇస్మాయిల్,మోయిన్ ,ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను బకాయిలను చెల్లిస్తున్న ప్రభుత్వ కార్యాలయాలు



మిర్యాలగూడ, మార్చి 28:– (వార్తా మిర్రర్) మిర్యాలగూడ మున్సిపాలిటీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల 520 ఆస్తుల కింద సుమారు రూ.3.62 కోట్లు బకాయిలుండగా సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్, తహసీల్దార్ ఎన్.హరిబాబు ఆస్తి పన్ను చెల్లించి బోణీ చేశారు. మిర్యాలగూడ మున్సిపాలిటీ సుమారు 10కోట్ల రూపాయల ఆదాయం చూపితే కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నుండి 10 నుండి 15 కోట్ల రూపాయల వరకు నిధులు వచ్చే అవకాశం ఉంది. దీంతో ఇప్పటి వరకు ప్రైవేట్ ఆస్తుల ఆస్తి పన్ను వసూలు పై దృష్టి పెట్టిన అధికారులు ఇప్పటి వరకు సుమారు రూ.1.5 కోట్లు మాత్రమే వసూలు చేయగలిగారు. ఆస్తిపన్ను ప్రభుత్వ కార్యాలయాలు కూడా చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎన్ఎస్పి క్యాంపు కార్యాలయాలు, సిబ్బంది క్వార్టర్స్ కలుపుకుని సుమారు 3 కోట్ల రూపాయల పైనా బకాయి ఉన్నారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని వివిధ శాఖల కార్యాలయాలు కలిపి సుమారు 60 లక్షల రూపాయలు బకాయి ఉన్నారు. ఇలా బిఎస్ఎన్ఎల్, తపాల శాఖ, రైల్వే, ఎఫ్సీఐలు ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వ కార్యాలయాలు కూడ చెల్లిస్తే ఆర్థిక సంఘం నిధులు వెంటనే వచ్చే అవకాశం ఉంది. మొత్తం మీద లక్ష్యం సాధించేందుకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది సెలవు రోజుల్లో కూడ కష్ట పడుతున్నారు.



## నిరుపేద మైనార్టీ కుటుంబాలకు రంజాన్

## సందర్భంగా చీరల పంపిణీ చేసిన..ఎండి రహీం షరీఫ్

### రంజాన్ పర్వదినాన్ని ప్రతి మైనార్టీ కుటుంబం ఆనందంగా గడపడమే నా లక్ష్యం.

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి గణేష్ సాగర్

సంస్థాన్ నారాయణపురం గ్రామ నిరుపేద మైనార్టీ కుటుంబాలకు చీరల పంపిణీ చేసిన. మునుగోడు నియోజకవర్గ మైనారిటీ నాయకులు ఎండి రహీం షరీఫ్,వారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పవిత్రమైన రంజాన్ మాసంలో ముస్లిం సోదర సోదరీమణులు నిష్టతో కఠిన ఉపవాసాన్ని ఆచరిస్తారని పేర్కొన్నారు. ఈ రంజాన్ మాసం లో సామరస్యాన్ని, సంతోషాన్ని, సౌభ్రాతృత్వాన్ని పెంపొదిస్తుందని తెలిపారు.రంజాన్ మాసంలో ప్రతి మైనార్టీ కుటుంబం సంతోషంగా గడపాలని నా ఉద్దేశంతో నాకు తోచిన సహాయాన్ని అందిస్తున్నానని తెలిపారు ఎండి రహీం షరీఫ్, కుల మతాలకతీతంగా నా సేవలను మునుమందు ఇలాగే కొనసాగిస్తానని తెలిపారు

## హైడ్రా కమిషనర్ ను కలిసిన దూబే కాలనీవాసులు.




శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి పరిధి దూబే కాలనీలోని 10 మీటర్ల రోడ్డును లింగంపల్లి రైల్వే స్టేషన్ రోడ్డుకు అనుసంధానం చేయాలని దూబే కాలనీవాసులు హైడ్రా కమిషనర్‌ను కోరారు. శుక్రవారం దూబే కాలనీ వాసులు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను సికింద్రాబాద్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అంజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ.. దూబే కాలనీ 111 సర్వే నెంబర్ లోని 10 మీటర్ల దూరంలో ఉన్న రోడ్డుతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, కొన్ని సార్లు రోడ్డు రద్దీగా ఉండడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. రైల్వే స్టేషన్ రోడ్డుకు మా కాలనీ రోడ్డుకు అనుసంధానం చేస్తే ప్రయాణం సాఫీగా సాగేందుకు వీలుంటుందని కోరారు. దీనికి హైడ్రా కమిషనర్ రంగనాథ్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే రోడ్డును పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని కాలనీవాసులు తెలిపారు. కమిషనర్ ను కలిసిన వారిలో కాలనీ గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, కాలనీ వాసులు ఉన్నారు.




## ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉంది

### వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తాం

### ఎమ్మెల్యే బిఎల్ఆర్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్

మిర్యాలగూడ మార్చి 28:–( వార్త మిర్రర్) ముస్లిం మైనారిటీల సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, ఎమ్మెల్సీ కె.శంకర్ నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక అరాఫత్ మస్జిద్ లో ఆయన ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. ఈద్గాల సమస్యలు లేకుండా చేస్తానని ఆయన అన్నారు. ఇఫ్తార్ కార్యక్రమం సోదర భావం పెంపొందిస్తుందని ఆయన తెలిపారు. వక్ఫ్ సవరణ చట్టం దేశం, రాష్ట్రంలో అమలు కాకుండా చూడాలని మౌలానా కోరారు. అనంతరం భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్, డిఎస్పి రాజశేఖర్రాజు, తహసీల్దార్ ఎన్.హరిబాబు, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, ముస్లిం పెద్దలు, బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.



## ఖురాన్ కంఠస్థం చేసి తరావిహ్ నమాజ్ చదివి వినిపించిన మజీద్ ఇమామ్ సాహబ్

### ఘనంగా సన్మానించిన మజీద్ కమిటీ సభ్యులు

సంస్థాన్ నారాయణపూర్ మార్చి 28 :( వార్త మిర్రర్ )

నారాయణపురం మండల కేంద్రంలోని జనగాం గ్రామంలో పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలను పురస్కరించుకొని స్థానిక ముస్లీం సోదరులు మజీద్ ఏ మహ్మద్ ఖాసీం మజీద్ లో రంజాన్ నెల ప్రారంభమైన ప్రతి రోజు నుండి లైలతుల్ ఖద్ర్ రాత్రి వరకు ఇషా నమాజు అనంతరం తరావిహ్ నమాజు లో మజీద్ ఇమామ్ సాహబ్ షంషధ్ ఖురాన్ నీ కంఠస్థం చేసి స్థానిక ముస్లీం సోదరులకు తరావిహ్ నమాజు చదివించడం జరిగింది. వారికి భువనగిరి ఫేరోజ్ భాయ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సన్మాన కార్యక్రమంలో మత పెద్ద మహ్మద్ ఉస్మాన్ సాహబ్ మజీద్ ఇమామ్ సాహబ్ షంషద్ కి పూల మాలలతో ఘనంగా సత్కరించారు. అనంతరం మిఠాయి తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు షేక్ కైసర్, మజీద్ కమిటీ సధర్ సాహబ్ మహ్మద్ మునీర్, నాయబ్ సదర్ మహ్మద్ ఏజాస్, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా నాయకులు మహ్మద్ కాలేక్, కమిటీ సభ్యులు మహ్మద్ అజీమ్, మహమ్మద్ సలీం, మహ్మద్ అఖిల్, మహ్మద్ ఆధిల్, అర్బాస్, అస్లామ్ తదితరులు పాల్గొన్నారు.



## భక్తి సేవా బాలునికి దుబ్బరాజేశ్వర అన్నదాన సేవా సమితి ఘనంగా సన్మానం

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) మార్చి 28

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం లోని వీరాపూర్ గ్రామానికి చెందిన సోమ అభిలాష్ అనే బాలుడిని పెంబట్ల శ్రీ దుబ్బరాజేశ్వర అన్నదాన సేవా సమితి సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మూడు రోజుల అన్నదాన కార్యక్రమంలో నిత్యం సేవ చేసిన సందర్భంగా బాలుడు అభిలాష్ ను సన్మానించినట్లు సేవా సమితి సభ్యులు తెలిపారు. చిన్నతనం నుండే భక్తి భావంతో పాటు, సేవా భావాన్ని కలిగి ఉండడం అభినందనీయమని, బాలుడిని కన్న తల్లిదండ్రులు ధన్యజీవులని అభినందనలు తెలిపారు. చిన్నతనం నుండే భక్తి భావంతో పాటు సేవా గుణాన్ని కలిగి ఉండి అందరికీ ఆదర్శంగా నిలవడం గమనార్హం అని బాలుడిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో దుబ్బ రాజేశ్వర స్వామి అన్నదాన సేవా సమితి సభ్యులు, వీరాపూర్ గ్రామ నాయకులు సోమ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



## బ్రహ్మశ్రీ మునుగోటి రమేష్ కుమార్ శర్మ కు జ్యోతిష జ్ఞాన రత్న బిరుదు అందజేత

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) మార్చి 28

బ్రహ్మశ్రీ మునుగోటి రమేష్ కుమార్ శర్మ కు విజయవాడలో ఉగాది పురస్కారాలు సందర్భంగా వేదిక్ ఆస్ట్రాలజీ 15 వ కాంక్లేవ్ నందు “జ్యోతిష జ్ఞాన రత్న” బిరుదము అందజేశారు. దీనిని పురస్కరించుకొని శ్రీ గురుదత్త బ్రాహ్మణ యువజన సేవా సంఘం, మెట్పల్లి కార్యవర్గ సభ్యులు వారికి చిరు సన్మానము చేసి వారి ఆశీర్వాదం పొందడం జరిగినది. నేటితరం యువకుల్ని కూడా వారిలాగా తీర్చిదిద్దాలని వారిని కోరడం జరిగినది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు డిఎస్కే ప్రసాద్, ఉపాధ్యక్షులు గిరిధరి శర్మ, ప్రధాన కార్యదర్శి మోహన్ కృష్ణ, కోశాధికారి రవికుమార్ శర్మ, సభ్యుడు శరత్చంద్రశర్మలు పాల్గొన్నారు.

## మరికొంత మందికి లేఆఫ్.. తొలగించిన వారికి ఇన్ఫోసిస్ ‘కొత్త’ ఆఫర్

దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ మరికొంత మందిని తొలగించింది. అంతర్గత మదింపులో ఉత్తీర్ణులు కాలేదంటూ ఇన్ఫోసిస్ మార్చి 26న తమ మైసూరు క్యాంపస్ నుండి 30-45 మంది ట్రైనీలను తొలగించినట్లు వార్తా సంస్థ మనీకంట్రోల్ నివేదిక తెలిపింది. అయితే తొలగింపునకు గురైన ట్రైనీలకు మరో ఆఫర్ ప్రకటించినట్లు తెలుస్తోంది. ఐటీ కంపెనీలో ఉద్యోగాలు కోల్పోయిన ట్రైనీలకు ప్రత్యామ్నాయ కెరీర్ మార్గంగా ఇన్ఫోసిస్ బిజినెస్ ప్రాసెస్ మేనేజ్‌మెంట్ (బీపీఎం) లో ఉద్యోగాల కోసం 12 వారాల శిక్షణను అందించేందుకు ముందకు వచ్చింది. ఇదే మైసూరు క్యాంపస్‌కు చెందిన సుమారు 350 మంది ట్రైనీలను తొలగించిన రెండు నెలల తర్వాత ఇన్ఫోసిస్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. బీపీఎం కోర్సును ఎంచుకున్న వారికి ఈ శిక్షణను స్పాన్సర్ చేస్తామని ఇన్ఫోసిస్ ప్రకటించింది. “మీ ఫైనల్ అసెస్‌మెంట్ ఫలితాలను వెల్లడిస్తున్నాం?. అదనపు ప్రిపరేషన్ సమయం, సందేహ నివృత్తి సెషన్లు, అనేక మాక్ అసెస్మెంట్ అవకాశాలు ఇచ్చినప్పటికీ మీరు ‘ఫౌండేషన్ స్కిల్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్’లో అర్హత ప్రమాణాలను చేరుకోలేకపోయారు” అని ట్రైనీలకు పంపిన మెయిల్స్‌లో కంపెనీ పేర్కొంది. తొలగించిన ట్రైనీలకు ఇన్ఫోసిస్ ఒక నెల జీతాన్ని ఎక్స్‌గ్రేషియాగా చెల్లిస్తోంది. దీంతో పాటు రిలీవింగ్ లెటర్లను అందిస్తోంది. ఇక బీపీఎం మార్గాన్ని ఎంచుకోవడానికి ఇష్టపడని వారికి మైసూరు నుంచి బెంగళూరుకు రవాణా సౌకర్యం కల్పించి, వారి స్వగ్రామానికి ప్రామాణిక ప్రయాణ భత్యం అందిస్తుంది. అవసరమైతే, ట్రైనీలు బయలుదేరే తేదీ వరకు మైసూరులోని ఎంప్లాయీ కేర్ సెంటర్లో ఉండవచ్చు. క్యాంపస్ నుంచి వెళ్లాలనుకునే ట్రైనీలు మార్చి 27లోగా తమ ప్రయాణ, వసతి ప్రాధాన్యతలను సమర్పించాలని ఇన్ఫోసిస్ కోరింది. మరోవైపు ట్రైనీల తొలగింపునకు సంబంధించి ఇన్ఫోసిస్ ఎలాంటి కార్మిక చట్ట ఉల్లంఘనలకు పాల్పడలేదని కర్ణాటక కార్మిక శాఖ డాక్యుమెంటరీ సాక్ష్యాల ఆధారంగా క్లీన్ చిట్ ఇచ్చింది. ‘వారంతా కేవలం ట్రైనీలు మాత్రమే. కొందరు మూడు నెలల శిక్షణ మాత్రమే తీసుకున్నారు. దీనిని లేఆఫ్ అనలేం కాబట్టి ఇలాంటి సందర్భాల్లో ఈ కార్మిక చట్టాలు వర్తించవు.

# 64 లక్షలతో 750 మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణం

### సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి









వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి మార్చి 28,చౌటుప్పల్ పురపాలక కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సర్వసభ్య సమావేశంను శుక్రవారం సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సంఘ కార్యదర్శి సంఘం యొక్క జమఖర్చులు, అంచనా బడ్జెట్ ను చదివి వినిపించగా దీనిని సర్వసభ్య సమావేశ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు చైర్మన్ తెలిపారు. సర్వసభ్య సమావేశము తీర్మానించిన వాటిలో 64 లక్షలతో 750 మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణం, 16 లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణం,13 లక్షలతో మండల పరిధిలోని ఎస్ లింగోటం గ్రామంలోని సంఘ భవన మరమ్మత్తులు,100% రైతులకు రుణమాఫీ చేయడం, పిలాయిపల్లి కాలువకు మరమ్మత్తుల తోపాటు మండలంలోని గ్రామాల చెరువులను నింపి రైతులకు సాగునీరు అందించాలని, చౌటుప్పల్ మండల కేంద్రంలో హార్టికల్చర్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలి, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు సంఘం ద్వారా టర్పాన్లను అందజేయడం, రైతు సమావేశ మందిరంను నూతనంగా నిర్మాణం చేయుట వంటి తీర్మానాలను సంఘ సభ్యులు ఆమోదించినట్లు చైర్మన్ తెలిపారు. అనంతరం సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి రైతు సమావేశ నూతన భవన నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ముత్యాల నాగరాజు, సంఘ సభ్యులు వైస్ చైర్మన్ చెనగొని అంజయ్య గౌడ్, బోరం నర్సిరెడ్డి, దూర్కా కృష్ణ, పబ్బతి వెంకటయ్య, దొడ్డి శ్రీశైలం, బొడ్డు పద్మ, దుబ్బాక శశిధర్ రెడ్డి, దౌడీ బాలరాజు, బాతరాజు సాయిలు, మాజీ జెడ్పిటిసి పెద్దిటి బుచ్చిరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ సంజీవరెడ్డి,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గిర్కాటి నిరంజన్ గౌడ్, బిఆర్ టి యు జిల్లా అధ్యక్షుడు ఢిల్లీ మాధవరెడ్డి,మాజీ ఎంపిటిసి బురుగు కృష్ణారెడ్డి, మాజీ డైరెక్టర్లు ఎస్ రాంరెడ్డి, కే యాదయ్య, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తూర్పునూరు మల్లేష్ గౌడ్, రైతులు పాల్గొన్నారు.




## మూడో కంటికి చిక్కని ‘సిగ్నల్’.. ఈ యాప్ గురించి తెలుసా?

వాట్సాప్ మాదిరిగానే.. అమెరికాలో ‘సిగ్నల్’ అనే మెసేజింగ్ యాప్‌ను చాటింగ్ చేయడానికి ఉపయోగిస్తారు. తాజాగా ఈ యాప్ నుంచే యెమెన్ వైమానిక దాడులకు సంబంధించిన ప్రణాళికలు బయటకు పొక్కాయి. ఈ నేపథ్యంలో ఈ యాప్ కోసం ఆరా తీసేవాళ్లు పెరిగిపోయారు. ఇంతకీ ఈ యాప్ ఏమిటి?, దీనిని ఎవరు ప్రారంభించారు?.. అమెరికా అధ్యక్ష భవనం సిబ్బంది ఈ యాప్‌ను వినియోగించడానికి ఏమైనా ప్రత్యేకత ఉందా?.. వివరాల్లోకి వెళ్తే.. సిగ్నల్ అనేది మెసేజింగ్ యాప్. దీనిని ‘మోక్సీ మార్లిన్‌స్పైక్’ రూపొందించారు. సిగ్నల్ యాప్ ద్వారా టెక్స్ట్ మెసేజస్, ఫోటోలు, రికార్డ్స్ వంటివి షేర్ చేసుకోవచ్చు. వాట్సాప్ తరహాలోనే మెసేజ్ పంపిన వారు, రిసీవ్ సీగేసుకున్న వారు మాత్రమే సందేశాలను చూడగలరు. ఒక నిర్ణీత సమయం తరువాత సమాచారం కనిపించకుండా చేసే ఆప్షన్ కూడా ఇందులో ఉంది. మూడో మనిషి చూడటానికి అవకాశం లేదు. అయితే..సిగ్నల్‌కు వాట్సాప్ కంటే అత్యంత సురక్షితమైనదనే ప్రచారం ఉంది. సురక్షితమైన యాప్ కావడంవల్లే అమెరికాలోని ఫెడరల్ అధికారులు, వైట్ హౌజ్ సిబ్బంది దీనిని ఉపయోగిస్తుం టారు. సిగ్నల్ మెసేజింగ్ యాప్‌ను ప్రపం చవ్యాప్తంగా.. ఏడు కోట్లమంది ఉపయో గిస్తున్నట్లు (ఇప్పటిదాకా డౌన్‌లోడ్లు) గణాం కాలు చెబుతున్నాయి. దీనిని ఎక్కువ మంది ఉపయోగించడానికి ప్రధాన కారణం.. ఇది సాధారణ వాట్సాప్, మెటా కంటే కూడా సుంక్షితమైనది కావడమనే ముద్రపడిపోవడం.

# ఉపగ్రహాల్లో అక్కడికక్కడే విద్యుదుత్పత్తి!



హైదరాబాద్: ఉపగ్రహాలతో శాటిలైట్ టీవీలు మొదలుకొని ఖనిజాల గుర్తింపు వరకూ అనేక ప్రయోజనాలున్నాయి. అయితే భూమికి దూరంగా కక్ష్యల్లో తిరిగే ఉపగ్రహాలు పని చేయాలంటే విద్యుత్తు కావాలి. ఇప్పటివరకూ బరువైన సోలార్ ప్యానెల్స్ లేదా బ్యాటరీలతో ఈ విద్యుత్తు తయారీ జరుగుతోంది. ఇలా కాకుండా... రేడియో ధార్మిక పదార్థాలు వెలువరించే వేడినే విద్యుత్తుగా మార్చగలిగితే? ఎన్నో ప్రయోజనాలుంటాయి. హైదరాబాదీ స్టార్టప్ కంపెనీ హైలెనర్ టెక్నాలజీస్ అచ్చంగా ఇదే పనిలో ఉందిప్పుడు. ఈ దిశగా టేక్‌మీ2స్పేస్ అనే కంపెనీతో ఒక అవగాహన ఒప్పందాన్ని కూడా కుదుర్చుకుంది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. వేడిని విద్యుత్తుగా మార్చేందుకు ఇప్పటికే థర్మో ఎలక్ట్రిక్ జనరేటర్ టెక్నాలజీ అందుబాటులో ఉంది కానీ.. వీటితో అధిక మొత్తంలో విద్యుత్తును ఉత్పత్తి చేయడం కష్టసాధ్యం. మరోవైపు హైలెనర్ టెక్నాలజీస్ సంస్థ ప్రపంచంలో మొదటిసారి కోల్డ్ ఫ్యూజన్ టెక్నాలజీ ద్వారా కాలుష్యం ఏమాత్రం లేని విద్యుత్తును ఉత్పత్తి చేసిన విషయం తెలిసిందే. టేక్‌మీ2 స్పేస్ భూ కక్ష్యలో ఉపగ్రహాలను ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తోంది. ఈ రెండు కంపెనీలిప్పుడు చేతులు కలిపాయి. ఉపగ్రహాలకు విద్యుత్తును అందించేందుకు హైలెనర్ అభివృద్ధి చేస్తున్న వ్యవస్థలను పరీక్షించేందుకు నిర్ణయించాయి. వేడిని ఉపయోగించుకుని విద్యుత్తును ఉత్పత్తి చేయడం.. ఉపగ్రహాల్లోని కంప్యూటర్లను నడిపించడం ఈ రెండు సంస్థల మధ్య కుదిరిన ఒప్పందం. లెనర్ టెక్నాలజీ అంతరిక్షంలోనూ పనిచేస్తుందని నిరూపించడం చాలా కీలకం. టేక్‌మీ2స్పేస్ నైపుణ్యం, ప్లాట్‌ఫామ్‌ల సాయంతో ఈ విషయాన్ని నిరూపించేందుకు ఎంతో ఉపయోగపడతాయి” అని హైలెనర్ టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు, సీఈవో సిద్ధార్థ దురైరాజన్ తెలిపారు. ఈ ప్రయోగాలు విజయవంతమైతే.. భవిష్యత్తులో సుదీర్ఘ అంతరిక్ష ప్రయాణాల్లోనూ అక్కడక్కడే విద్యుత్తును ఉత్పత్తి చేసుకోగల అవకాశం ఏర్పడుతుంది. అది కూడా వృథా అవుతున్న వేడి సాయంతో!!“ఉపగ్రహాల్లో వేడిని తగ్గించడంతోపాటు విద్యుత్తును ఉత్పత్తి చేయడం వల్ల ఎన్నో అదనపు ప్రయోజనాలు ఉంటాయి. హైలెనర్ టెక్నాలజీస్ ఉత్పత్తులు ఈ ఘనత సాధిస్తే అతితక్కువ స్థలంలో దీర్ఘకాలం పనిచేయగల ఒక ఇంధన వ్యవస్థ అందుబాటులోకి వస్తుంది” అని టేక్‌మీ2 స్పేస్ వ్యవస్థాపకుడు రోనక్ కుమార్ సామంత్రాయ్ తెలిపారు. సౌర విద్యుత్తు, బరువైన బ్యాటరీల వాడకాన్ని తగ్గించడం సాధ్యమవుతుందని వివరించారు.

# స్టాలిన్ బుట్టలో పడి కేంద్రంపై నిందలు

హైదరాబాద్:అసెంబ్లీలో డీ లిమిటేషన్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బిజెపి వ్యిరేకించింది. ఈ తీర్మానంపై బీజేఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ స్పందించారు. శాసన సభలో ముఖ్యమంత్రి నియోజకవర్గాల పునర్వి భజనపై తీర్మానం ప్రవేశ పెట్టాడు.. దాని పై చర్చ చేస్తాం అంటే అవకాశం ఇవ్వడం లేదు.. డీ లిమిటేషన్ పై కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పోరాటం చేస్తామని అంటున్నారు.. ఇప్పుడు కొత్తగా కలవడం ఏంటి..? కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎప్పుడో కలిసి పోయాయి.. మొన్న చెన్నైలో ఇరు పార్టీలు వెళ్లి స్టాలిన్ వీపు గోకి వచ్చారు.. స్టాలిన్‌కు వీపు దురద పెట్టడానికి కారణం ఉంది.. వచ్చే కొద్ది రోజుల్లో అక్కడ అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నాయి. కాబట్టి స్టాలిన్ డీ లిమిటేషన్ పై చర్చ పెట్టాడు.. కానీ మన రాష్ట్రంలో ఎన్నో సమస్యలు ఉంటే ఇక్కడ పని చేయడం మానేసి స్టాలిన్ వీపు గోకడానికి వెళ్ళారు.. డీ లిమిటేషన్ ఎవరికీ తెలియకుండా ఏమైనా చాటుగా చేస్తారా? డీ లిమిటేషన్ వల్ల ఏదో నష్టం జరగబోతున్నట్లు ప్రచారం చేస్తున్నారు.. వారి పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతని పక్కదారి పట్టించేందుకు మోడీపై విషం చిమ్మే ప్రయత్నం చేస్తున్నారు.. బీజేపీకి దేశంలోని అన్ని ప్రాంతాలు సమానమే.. అన్ని ప్రాంతాల్లో ప్రజలు మాకు సమానమే.

# అమెరికా ఎంబసీ షాక్.. భారత్‌లో 2 వేల వీసా దరఖాస్తులు రద్దు




భారత్‌లోని యూఎస్ ఎంబసీ ఇటీవల వేల సంఖ్యలో వీసా దరఖాస్తులను రద్దు చేసింది. మోసపూరిత కార్యకలాపాలను నిరోధించే చర్యల్లో సుమారు 2,000 వీసా అపాయింట్‌మెంట్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. రెండు నెలల క్రితం డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడుగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అమెరికా కొత్త ప్రభుత్వం కఠినమైన ఇమ్మిగ్రేషన్, వీసా విధానాన్ని చేపట్టింది.

**కారణం ఇదే..**

వీసా అపాయింట్‌మెంట్ల షెడ్యూలింగ్‌లో అవకతవకలపై యూస్ ఎంబసీ దృష్టి పెట్టింది. అందులో భాగంగా “బ్యాడ్ యాక్టర్స్” (అక్రమార్కులు) లేదా బాట్స్ (మెషీన్లు) ద్వారా అపాయింట్మెంట్ సిస్టమ్‌లో జరుగుతున్న ఉల్లంఘనల గుర్తించిన రాయబార కార్యాలయం ఆయా ఖాతాలను సస్పెండ్ చేసింది. ఇలా చేసిన సుమారు 2,000 వీసా అపాయింట్మెంట్లను రద్దు చేసింది. తమ షెడ్యూలింగ్ విధానాలను ఉల్లంఘించే ఏజెంట్లు, ఫిక్సర్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరిస్తామని అమెరికా రాయబార కార్యాలయం ఎక్స్ లో పోస్ట్ చేసింది. తక్షణమే ఈ నియామకాలను రద్దు చేస్తున్నామని, అనుబంధ ఖాతాల షెడ్యూలింగ్ అధికారాలను నిలిపివేస్తున్నామని పేర్కొంది.

**భారతీయులే ఎక్కువ**

విద్య, ఉద్యోగం, పర్యాటకం.. ఇలా వివిధ పనుల కోసం యునైటెడ్ స్టేట్స్ లోకి ప్రవేశించే అతి ఎక్కువ మందిలో భారతీయులు ప్రముఖంగా ఉంటున్నారు. భారత్ లో అమెరికా వీసా దరఖాస్తులు గణనీయంగా బ్యాక్ లాగ్ లను ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా బీ1, బీ2 దరఖాస్తుదారుల్లో జాప్యం ఎక్కువ ఉంటోంది. ఈ వీసాలు వ్యాపారం, పర్యాటకం కోసం ఉద్దేశించినవి. 2022-23లో దరఖాస్తు చేసుకున్నవారు 800 నుంచి 1000 రోజుల వరకు వేచి ఉండాల్సి వచ్చింది. ఇలాంటి సుదీర్ఘ నిరీక్షణ సమయాన్ని ఎదుర్కోవడానికి, జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్, థాయ్ రాజధాని బ్యాంకాక్‌లో భారతీయ దరఖాస్తుదారులకు అమెరికా వీసా అపాయింట్‌మెంట్లను తెరిచింది. వీసా వెయిటింగ్ టైమ్ గురించి భారత ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆందోళన వ్యక్తం చేస్తూ వస్తోంది. 2022లో అప్పటి అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్‌తో వీసా జాప్యంపై భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. కోవిడ్-19 మహమ్మారి కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని అప్పటి బైడెన్ ప్రభుత్వం పేర్కొంది. డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారానికి ఇటీవల జనవరిలో వాషింగ్టన్ వెళ్లిన జైశంకర్ కొత్త విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో మరోసారి ఈ అంశాన్ని లేవనెత్తారు.